

బాధితులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

గండేపల్లి మండలం ఉప్పలపాడులో శనివారం బోరు బావి రిపేర్ చేస్తూ విద్యుదాఘాతంతో మరణించిన గద్ద బాబీలు, బొదిరెడ్డి సూరిబాబు, కల్లి నాగేశ్వరరావు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రెక్కాడితే గాని డొక్కాడని ఇద్దరు పేద కూలీలు, ఒక మధ్యతరగతి రైతు మరణించిన ఘటనలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఒకే సంఘటనలో ముగ్గురు చనిపోయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. స్థానిక ఎంఎల్ఎ కనీసం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలో జరిగిన పరిశ్రమల ప్రమాదాలలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇచ్చిన విధంగా వీరికి కూడా పరిహారం చెల్లించాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు.

సామూహిక మరుగుదొడ్ల నిరుపయోగం

- స్వచ్ఛ భారత్ పథకంలో రూ.కోట్ల వ్యయంతో నిర్మాణం
- పర్యవేక్షణ మరిచిన అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం సామూహిక మరుగుదొడ్లు అవసరమని భావించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. గ్రామాలు స్వచ్ఛందంగా ఉండాలనే లక్ష్యంతో స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పలు గ్రామాల్లో వీటి నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా సుమారు రూ.40 కోట్ల నిధులతో 3 లక్షల సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినా ఎక్కడా వీటిని వినియోగించడం లేదు. గ్రామాల శివారు ప్రాంతాల్లో కొన్నిచోట్ల, సామాజిక స్థలాల్లో కొన్నిచోట్ల 10 నుంచి 15 మరుగుదొడ్లను కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నిర్మించి వదిలేశారు. కొన్నింటికి తలుపులు వేయలేదు. నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజలు వాటిని వినియోగించలేకపోయారు. చాలాచోట్ల నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో ప్రజలు అటువైపు కన్నెత్తి చూడడం మానేశారు. ప్రధానంగా నీటి సౌకర్యం, విద్యుత్తు సౌకర్యం, స్థలం ఎంపిక చేసిన ప్రదేశాలు పట్టించుకోకుండానే నిర్మాణాలు చేయడంతో ప్రజలు వీటిని విస్మరించారు. సుమారు 10 ఏళ్ల క్రితం వీటిని నిర్మించి అలా వదిలేయడంతో తుప్పలు, డొంకలు పేరుకుపోయి శిథిలావస్థకు చేరాయి. గ్రామాలకు శివారు ప్రాంతంలో ఉండటం వల్ల ప్రజలు వినియోగించడానికి ఆసక్తిని చూపలేకపోయారు. మరోవైపు వీటిని నిర్మాణ సమయంలో అధికారులు కనీస పర్యవేక్షణ కూడా చేయలేదు. దీంతో రూ. కోట్ల నిధులు వథాగా పోయాయని గ్రామీణ ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్వహణను గాలికి వదిలేసింది. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నేటికీ అనేక గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన యథేచ్ఛగా సాగుతోంది. ఈ మరుగుదొడ్లను వినియోగంలో తీసుకువస్తే బహిరంగ మలవిసర్జనను అరికట్టవచ్చు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీలు కలుగుతుంది. ప్రజలు ఆరోగ్యాలను కాపాడే అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాల్సి ఉంది.


పిఠాపురం మండలం కుమారపురంలో తుప్పల్లో కూరుకుపోయిన మరుగుదొడ్లు

వినియోగించడం లేదు

కొన్నేళ్ల క్రితం పలు గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లను నిర్మించిన మాట వాస్తవమే. అయితే ఎప్పటి నుంచో ప్రజలు వాటిని వినియోగించడం లేదు. తుప్పలు పెరిగిపోయి శిథిలావస్థకు చేరి ఉన్నాయి. ఇప్పుడు ప్రజలు అవగాహన పెంచుకుని ఎవరికి వారు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. దీంతో సామూహిక మరుగుదొడ్ల అవసరం లేదు. వాటిని కూల్చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.

- విక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, కాకినాడ జిల్లా.


పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రైల్వే స్టేషన్‌లో అంగన్‌వాడీల అరెస్ట్

పోలీస్ స్టేషన్ వద్ద వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తమ సమస్యలపై విజయవాడ అలంకార్ సెంటర్లో సోమవారం చేపట్టిన మహా ధర్నాకు వెళుతున్న సుమారు 70 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదివారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పోలీసులు అదుపులో తీసుకున్నారు. వారిని ఆటోలో సామర్లకోట పోలీస్ స్టేషన్ తరలించారు. పోలీస్ స్టేషన్ ఎదుట అంగన్వాడీలు కొంతసేపు ధర్నా చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు సొంత పూచీకత్తుపై వదిలేశారు. పెదబ్రహ్మదేవం, వేట్లపాలెం, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది అంగన్వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనలో ఈ ఆందోళనలో అంగన్వాడి కార్యకర్తలు సత్యవతి, భారతి, కనక, చింతామణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై నిర్బంధాలను ఆపండి

పెద్దాపురం తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీలను అక్రమంగా నిర్బంధించటం అన్యాయమని సిఐటియు మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆదివారం సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతి కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఈ నెల 25న తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం పోలీసులతో నిర్బంధాలకు, అరెస్టులకు పాల్పడటం అన్యాయమన్నారు. ఈ ధర్నాకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే అంగన్వాడీలను అరెస్టు చేయడం, నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామికమన్నారు. రైల్వే స్టేషన్ నుంచి మహిళలను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి నిర్బంధించడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను వెంటనే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి సిఐటియు మద్దతు ప్రకటించింది.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం భారీగా వేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ మెయిన్ మార్కెట్‌లో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు, దుంపల ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ నెలా విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయన్నారు. ట్రూ అప్, ఇడి, ఫిక్సిడ్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు వంటి రకరకాల పేర్లతో చార్జీలు విద్యుత్ బిల్లులో కలిపి వసూలు చేయడం దారుణమన్నారు. ఒకప్రక్క ఆదాయాలు సరిగా లేక, మరోపక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం గురించి గొప్పలు చెబుతూ, దొడ్డిదారిన ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి, సూరిబాబు, దుర్గాప్రసాద్, జైరామ్, ఆదర్శ్, పవన్ పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కొరటాల సత్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి కొరటాల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కె.వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పని చేశారని తెలిపారు. రైతు సమస్యలు, చేనేత కార్మికుల సమస్యలపై ఆందోళనలు చేయడం, పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు. నిరంతరం ప్రజాసమస్యలపై అధ్యయనం చేసేవారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రాజా, మలకా వెంకట రమణ, వి.చంద్రరావు, ఎం.జి.సూరిబాబు, ఆదర్శ, సాహిత్, తేజ, జయరాజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి వ్యకాసం నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 25 నుండచి 27 వరకు సిపిఐఎం అనుబంధ కేత్ మజ్దూర్ యూనియన్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు బాపట్లలో జరుగుతుంటే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు నోటీసులు జారీ చేయడం హాస్యాస్పదమని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు కెఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంత కాలం ధర్నాలకు, నిరసన కార్యక్రమాలకు వెళుతుంటే నిర్బంధం విధించేవారని ఇప్పుడు మీటింగ్‌లు, మహాసభలకు వెళ్ళవద్దని నిర్బంధం విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా ఒక సంఘం మహాసభ జరుగుతుంటే వేరే సంఘానికి నోటీసులు జారీ చేయడం హాస్యాస్పదం అన్నారు. ఈనిర్బంధాలతో ప్రజల గొంతు నొక్కాలని చూడడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. అది నియంతత్వ పద్ధతులకు నిదర్శనం అన్నారు.

ఆదిత్య ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ ఉత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. మొక్కలు నాటి ఈ వేడుకలను ప్రారంభించారు. అనంతరం నాయుడు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ, విద్యా సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొని వ్యక్తిత్వ వికాసం పొందాలని పిలుపునిచ్చారు. కళాశాల పరిసరాల్లో, దత్తత గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, విరివిగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర రావు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నితిన్, భీమేష్, నిస్సిప్రియ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సిబ్బంది, విద్యార్థులు

నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గండేపల్లి

గణేష్ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసే విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐ సూర్య అప్పారావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో గణేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక నిమజ్జనంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా విగ్రహ కమిటీ సభ్యులు ఇద్దరు ముగ్గురితో మాత్రమే నిమజ్జనం చేసే సమయంలో పంపించాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి -కరప

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని కరప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిలో వైద్య పరీక్షలను నిర్వహించి దీర్ఘకాలిక రోగాలు, పిల్లల, ఎముకల, జనరల్ వైద్యులతో క్యాంపు నిర్వస్తామన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా గ్రామాలలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉండాలన్న ముఖ్యమంత్రి ఆశయంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, హెచ్‌విలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగామిపై విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

కాగితాలతో పలు ఆకృతులను తయారు చేసే ఓరిగామి పట్ల బాల మందిరం విద్యార్థులకు మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. పి.వీరబాబు ఒరిగామి, డ్రాయింగ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కాగితం మడతలు వేసి పలు ఆకతులను తయారు చేసే ఒరిగామి కళ పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థి మెంటార్స్ బాలలకు కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం చిట్టి ఊహలు పత్రిక ఎడిటోరియల్ టీమ్ కార్యశాల జరిగింది. అక్టోబర్ రెండో వారంలో విద్యార్థులకు దసరా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు అంగర గోపాలకష్ణ వెల్లడించారు.

దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలను గుర్తించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఓటర్ లిస్ట్‌లో దొంగ ఓట్లు, డబల్ ఎంట్రీలను తప్పక గుర్తించాలని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మందాల గంగ సూర్యనారాయణ అన్నారు. పి.మల్లవరంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి) గృహంలో ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగుదేశం యూనిట్, బూత్ ఇన్చార్జుల అవగాహన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ ఆర్‌టియస్ (రియల్ టైం స్ట్రాటజీ) గ్రూప్‌ల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. మందాల గంగ సూర్యనారాయణ మాట్లాడుతూ బూత్ ఇన్చార్జులు ఓటర్ లిస్టులో ఉన్న డబుల్ ఎంట్రీలు, దొంగ ఓట్లు, డెత్‌లు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కల ప్రసాద్ బాబు, పెమ్మాడి నిరంజన్ కుమార్, సంగాడి శ్రీనివాస్, ధూళిపూడి సుబ్బారావు, నిమ్మకాయల మూర్తి, దున్నా సుబ్రహ్మణ్యం, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, ఊడా రామకష్ణ, వెంకటరమణ, వీరబాబు, నాగబాబు, దుర్గా ప్రసాద్, సత్యన్నారాయణ, బండి లక్ష్మణబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా దీక్షలు, ర్యాలీలు

చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు వ్యతిరేకంగా జిల్లావ్యాప్తంగా ఆదివారం దీక్షలు, ర్యాలీలు కొనసాగాయి.

ప్రజాశక్తి -యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ కాకినాడలో మత్స్యకారులు వినూత్నంగా నిరసన చేపట్టారు. 19వ వార్డు పెదజాలరిపేటలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, బైరెడ్డి పోతన్న ఆధ్వర్యంలో మత్స్యకారులు సముద్రంలో బోట్లపై నిరసన చేపట్టారు. చంద్రబాబు బెయిల్‌పై వచ్చేవరకు నిరసనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జివి.రామచంద్రరావు, కార్పొరేటర్ నొల్లి నుకరత్నం, తెడ్డు రాజు, దోడ చిరంజీవి, పిల్లా నూకన్న, ఒలిశెట్టి చినఎల్లయ్య, ఒలిశెట్టి సత్యరావు, పొట్టి అప్పన్న, వాడమదుల శ్రీను పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు బాలాజీ చెరువు సెంటర్‌లో చేపట్టిన దీక్షలు 11వ రోజుకు చేరాయి. అఖిలపక్ష కన్వీనర్ తాటిపాక మధు, నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, గ్రంధి బాబ్జి, దీక్షపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమంప చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పాన్ షాప్ అసోసియేషన్ సభ్యులు మరియు టైలర్స్ అసోసియేషన్ సభ్యులు గోపిశెట్టి బూరయ్య, తోటకూర సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. మాజీ మేయర్ సుంకర పావని ఆధ్వర్యంలో నల్ల జెండాలు, ప్లకార్డులతో నేలప్పన్ సెంటర్, సూర్యనారాయణ పురంలో ఇంటింటికీ కరపత్రాలు పంచారు. **కాకినాడ రూరల్** వలసపాకలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంత లక్ష్మి దంపతులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చీడిగలో భారీఎత్తున కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో జనసేన నాయకులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. **కరప** 12వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షకు కాకినాడ రూరల్ జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, పేరాబత్తుల రాజశేఖర్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో వేళంగి పంచాయతీ వద్ద దీక్ష చేపట్టారు. జనసేన నాయకులు భోగిరెడ్డి గంగాధర్, చింతా వెంకట్, అల్లు గంగాద్రి, మురళి, చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, కోనా వెంకటలక్ష్మి, కె.వినాయక్, బొంతు నాగేశ్వరరావు, గీశాల వెంకటేశ్వరరావు, అడపా రామచంద్రరావు, కె.భూషణం, పురం సత్యప్రసాద్, చంద్రు వెంకన్నరాయ చౌదరి, పలివెల జానకిరామయ్య, మేడిశెట్టి పట్టాభి, నులుకుర్తి వీరన్న పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** మాధవపట్నంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పిల్లి కృష్ణ ప్రసాద్, గుమ్మళ్ల రామకృష్ణ, చల్లా బుజ్జి, కుర్రా నారాయణస్వామి పాల్గొన్నారు.


కాకినాడలో బోట్లపై మత్స్యకారుల నిరసన


చిన్నారి గుండె ఆపరేషన్‌కు సహాయం

ప్రజాశక్తి-కాకినాడ

గుండెలో రంధ్రంతో అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న చిన్నారి శరణ్యకు చేయూత సంస్థ తరపున రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేసినట్టు సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ తెలిపారు. కొంతమూరుకు చెందిన రెండేళ్ల శరణ్య అనారోగ్య సమస్యను విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు తమ దృష్టికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. సంస్థ కార్యదర్శి అలీంతో పాటు తాను నిజనిర్ధారణ చేసి ఫండ్ సేకరించినట్టు తెలిపారు. 250 మందికి పైగా చేయూత సంస్థ సభ్యులు, దాతలు స్పందించి రూ.లక్షా నలభై తొమ్మిది వేలు అందించారన్నారు. శరణ్యకు ఉచితంగా ఆపరేషన్, వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా చేయూత గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల ద్వారా రూ.50 వేలను ఆదివారం అందించామన్నారు. చింతా నారాయణ మూర్తి, షేక్ వలీబాషా, పవన్ కళ్యాణ్, మలేశ్వరరావు, సురభి శారద, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న శేషారెడ్డి

కార్టూ'నిజం'



అది మనలాంటోళ్లకిరా.. కార్పొరేటోళ్లకి కాదు..!!

టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరంలో ప్రైవేట్ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని దీనిని స్థల యజమానులందరూ ఐక్యంగా అడ్డుకోవాలని, టిడిఆర్ బాండ్లు అసలైన స్థల యజమానులకు చేరలేదని ఇది ఒక మాయాజాలంలా ఉందని కాకినాడ పెద్ద శివాలయం మాజీ చైర్మన్ రాజనాల విజయ సారథి అన్నారు. ఆదివారం ఆయన తనకు చెందిన స్థలంలో మాట్లాడుతూ కాకినాడ గొడారిగుంట మూడు గుండ్ల సెంటర్ దగ్గర్లో సుమారు ఐదు ఎకరాలు పైబడి స్థలంలో మత్స్యకారులు అనాదిగా నివశిస్తున్నారన్నారు. అందులో కొన్ని ఖాళీగా ఉండటంతో అక్రమార్కుల కన్ను పడిందని ఆ స్థలంలో తాను సుమారు 500 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానన్నారు. తాను ఆ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించుకుంటే నగరపాలక ప్రణాళిక అధికారులు వచ్చి దౌర్జన్యం చేసి కూలగొట్టారన్నారన్నారు. ఇదేమిటని అడిగితే ఇది ప్రభుత్వ స్థలం అంటూ చెప్పారని దానికి సంబంధించిన ఆధారాలు, ఇతర ధవపత్రాలు అడిగితే అవన్నీ కార్పొరేషన్లో తెలుసుకోండని తమకు ఫోన్ వచ్చింది తాము చేస్తున్నామంటూ అక్కడ నుంచి జారుకున్నారన్నారు. ఈ స్థలానికి సంబంధించి కోర్టులో కేసు వేశానని అయినా నగరపాలక అధికారులు వచ్చి దౌర్జన్యం చేసి కోర్టున ధిక్కారానికి పాల్పడ్డారన్నారు. మత్స్యకారులు మాట్లాడుతూ తమకు కాక వేరే వారికి నగరపాలక అధికారులు టిడిఆర్ బాండ్లు ఇచ్చారన్నారు.

9న ఎల్‌ఐసి ఏజెంట్ల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎల్‌ఐసి పరిరక్షణ కోసం, ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 9న హైదరాబాద్ ఎల్‌ఐసి జోనల్ కార్యాలయం వద్ద ఏజెంట్లు తలపెట్టిన ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంటర్ జోన్ జనరల్ సెక్రటరీ పిఎల్.నరసింహారావు పిలుపు ఇచ్చారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో డివిజన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల ఎల్‌ఐసి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎల్‌ఐసిలో ఐపిఒ ప్రవేశపెట్టి ఎల్‌ఐసిని ప్రైవేటుపరం చేసి బడా కార్పొరేట్లకు అప్పగించే దిశలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐపిఒ పేరుతో ఎల్‌ఐసి షేర్లను అమ్మజూపడం అన్యాయమన్నారు. ఎల్‌ఐసి మనుగడను కాపాడేందుకు, ఏజెంట్ల సమస్యలు పరిష్కరించేందుకు తలపెట్టిన ఈ ధర్నాను అందరూ విజయవంతం చేయాలన్నారు. ఈ సభలో టి.కోటేశ్వరరావు, జి.రవిశంకర్, కె.నాగిరెడ్డి, బి.వీరభద్రరావు, కెఎస్ఎన్.మూర్తి, ఇసి మెంబర్ టి.వెంకటరావు, సిహెచ్.వరప్రసాద్, లోవరాజు, లోకేష్ బాబు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు నాణ్యమైన ఆహార పదార్థాలను నిర్ణీత ధరలకు విక్రయించాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఛీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం సామర్లకోట రైల్వే ప్లాట్‌పారంపై ఐఆర్‌సిటిసి ఫుడ్ స్టాల్స్, ఫ్రూట్ స్టాల్స్‌లో ఆహార పదార్థాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను ప్రయాణికులకు అందించాలన్నారు. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. స్టాల్‌లో ఉన్న వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ గడువు తేదీలను పరిశీలించారు. స్టాల్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది నిర్ణీత యూనిఫారాలు, ఐడెంటిటీ కార్డులు కలిగి ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రైల్వే ఉద్యోగుల పిల్లలకు దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లాలో కాకినాడ సామర్లకోట పిఠాపురం అన్నవరం స్టేషన్‌లో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు పోటీల్లో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, చీఫ్ హెల్త్ ఇన్స్పెక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్ బహుమతులను సమకూర్చారు. రైల్వే సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి ఏలేరు కాలువలో అప్పన్నపాలెం వద్ద గణేష్ నిమజ్జనాలు జరగటం ఆనవాయితీ. దీంతో ఈ మేరకు ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు మున్సిపల్, ఫిషరీస్, ఏలేశ్వరం ప్రాజెక్టు అధికారులు, ఆరోగ్య సిబ్బందిని ఎప్పటికప్పుడు సమన్వయపరిచి గణేష్ నిమజ్జనాలు ఎటువంటి ప్రమాదాలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేష్ విగ్రహాలతో పాటు వద్దులు చిన్నపిల్లలు మద్యం సేవించిన వారు రావద్దని హెచ్చరించారు. విగ్రహాలతో పాటు ఈత వచ్చినవారు నలుగురు లేదా ఐదుగురు మాత్రమే కాలువలోకి వెళ్లేందుకు అనుమతి ఇస్తామన్నారు. ఈ మేరకు ఏలేరు కాదు వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

అదృశ్యమైన బాలిక మరణం

ప్రజాశక్తి - పెద్దాపురం



పవీణ కుమారి (ఫైల్ ఫొటో)

ఐదు రోజుల క్రితం అదృశ్యమైన బాలిక ఆదివారం సాయంత్రం కట్టమూరు గ్రామ శివారులో శవమై కనిపించింది. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన జ్యోతి అనే మహిళ 5వ తరగతి చదువుతున్న తన కుమార్తె ప్రవీణ కుమారి(10) కనిపించడం లేదని 5 రోజుల క్రితం పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం పెద్దాపురం మండలం కట్టమూరు శివారులో కుళ్లిపోయిన స్థితిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆమె ఒంటిపై ఉన్న దుస్తులను బట్టి ప్రవీణ కుమారిగా గుర్తించారు. వెంటనే సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ బి సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి విచారణ ప్రారంభించారు. సమీప బంధువే ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు. .

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -ఏలేశ్వరం

ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా చేపల తొట్టిలో 25 లీటర్ల నాటు సారాను మోటార్ సైకిల్ పై తరలిస్తున్న వ్యక్తిని ఏలేశ్వరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ జి సతీష్ మీడియాకు వెల్లడించారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఏలేశ్వరం శివారు ఆర్ అండ్ బి రహదారిపై ఆదివారం తనిఖీలు చేస్తుండగా అడ్డతీగల మండలం కొనలోవ గ్రామం నుంచి చేపల తొట్టిలో రహస్యంగా సారా తీసుకొస్తున్న సొంటెపు శ్రీనును అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందుతుడిని సోమవారం ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ఉండూరు గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో ఆదివారం సాయంత్రం ద్రాక్షారామ పోలీసులు దాడి చేసి అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, నాలుగు మోటారు సైకిల్లు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ద్రాక్షరామ ఎస్ఐ.బి వినోద్ దర్యాప్తు చేస్తున్నారు.



నిమజ్జన ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి

వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్పి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనం చేసే కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పి సతీష్ కుమార్ సూచించారు. ఉప్పాడ సముద్ర తీర ప్రాంతంలో వినాయక నిమజ్జనం చేసే ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో కాకినాడ, పెద్దాపురం పోలీస్ డివిజన్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఏడవ రోజు జరుగుతున్న శోభ యాత్రలు, వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సముద్ర తీర ప్రాంతంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో కాకినాడ రూరల్, పిఠాపురం సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక తరవాణిపేటలోని వరసిద్ధి వినాయకస్వామి మందిరములో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సరస్వతీ పూజా కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, 4వ వార్డు కౌన్సిలర్ గుండు రామ తులసి, వాదా ప్రసాదరావు, వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు గుండు వీర తాతరాజు, సిరంగు ఈశ్వరరావు, గ్రంధి బుల్లిబాబు, జాయన సాయి సత్యనారాయణ, కోడూరి శ్రీనివాస్, ఆరేటి మహేష్, నాగవరపు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి దుర్గంధం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలో ఆదివారం కురిసిన వర్షానికి అనేక రహదారుల్లో పేరుకుపోయిన మురుగు వర్షపు నీటితో మిళితమై రహదారులను దుర్గంధంగా మార్చి వేశాయి. అనేక ప్రాంతాల్లో డ్రైన్లలో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీలో కలిసి రోడ్లపై ప్రవహిస్తోంది. స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్ నుంచి ఫ్లీడర్ల వీధి, పాల అప్పారావు సెంటర్ నుంచి మహారాణి సత్రం వీధి ఆదివారం కురిసిన వర్షపు నీటిలో మురుగు మిలితమై దుర్గంధంగా మారిపోయాయి. ఈ రహదారిలో వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన పరిశ్రమకు ప్రోత్సాహకాలు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి బివి.రమణ





ప్రజాశక్తి-అమలాపురం

తమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉద్యాన పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని జిల్లా ఉద్యాన అధికారి బి.వి రమణ తెలిపారు. అందిస్తున్న రాయితీలను రైతులు బాగా ఉపయోగించుకోవడంతో పాటు అధిక ఆదాయం ఆర్జించే పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉప ఉత్పత్తులు తయారు చేసుకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఆయన 'ప్రజాశక్తి' ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలను వెల్లడించారు.

జిల్లాలో ఏయే ఉద్యాన పంటలు,ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి.

ఎక్కువగా కొబ్బరి, అరటి, ఆయిల్ పామ్, మామిడి, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,23,000 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 96 వేల ఎకరాల్లో కొబ్బరి, 9 వేల ఐదు వందల ఎకరాల్లో అరటి, సుమారు 4 వేల ఐదు వందల ఎకరాల్లో కాయగూరలు, మిగిలిన విస్తీర్ణంలో ఆయిల్ పామ్, కోకో, బొప్పాయి, కంద, పసుపు, వక్కా, తమలపాకు తదితర పంటలు సాగవుతున్నాయి.

శీతల గిడ్డంగుల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నారా.

రైతులకు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 30 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షల యూనిట్ విలువలో రూ.11.25 లక్షలు వరకూ రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది.ఈ యూనిట్లను నెలకొల్పుకునే రైతులు ఉద్యాన శాఖను సంప్రదించాలి.

ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్లకు ఎటువంటి రాయితీలు ఇస్తున్నారు.

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆహార పదార్థాల శుద్ధికరణ యూనిట్ల కోసం రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. రూ.30 లక్షల యూనిట్ విలువకు ప్రభుత్వం గరిష్టంగా 35 శాతం రాయితీలను ఇస్తుంది. అలాగే యూనిట్ విలువలో 90 శాతం బ్యాంకు రుణాలు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సమీకత ఉద్యాన పంటల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

సమీకత ఉద్యాన పంటల అభివద్ధి పథకంలో భాగంగా మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ లను ప్రభుత్వం అందజేస్తుంది. రూ.25 లక్షలు యూనిట్ విలువ ఉంటుంది. కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు, కొబ్బరి పీచు పరిశ్రమలు ఈ పథకంలో భాగంగా నెలకొల్పుకునే అవకాశం ఉంది.ఇందులో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. జిల్లాలో 5 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఎస్సీ లబ్ధిదారులు కూడా అవకాశం ఉంది.

ఆధునిక సాగు పద్ధతులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు.

ఆధునిక సాగు పద్ధతుల్లో భాగంగా ఉద్యాన శాఖ షెడ్ నెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. 35 శాతం సబ్సిడీతో పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు.

ఇ-పంట నమోదు తప్పనిసరి అంటున్నారు నిజమేనా.

రైతుల పంటలకు ఇన్ ఫుట్ సబ్సిడీ రావాలన్నా, ఇన్సూరెన్స్ పొందాలన్నా, బ్యాంకుల నుంచి రుణాలు కావాలన్నా ఇలా ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందాలన్నా ఇ-పంట నమోదు తప్పనిసరి.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమల నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తోంది. కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా వ్యక్తులు, రైతులు, సంఘాలకు 35-50 శాతం రాయితీపై యూనిట్ లను పెట్టుకునే అవకాశం ఉంది.

అంతర పంటల వల్ల ఉపయోగం ఏమిటి.

రైతులు అదనపు ఆదాయం పొందుటకు కొబ్బరి, ఆయిల్ ఫాం తదితర పంటలలో కురగాయలు, అల్లం, పసుపు, కంద, కోకో వంటి పంటలను వేసుకోవచ్చు. వీటిని ఉద్యానశాఖ తరుపున రాయితీలో అందిస్తున్నాం.

యానాం వార్తలు

ఇడబ్ల్యూఎస్‌పై ప్రజా చర్చా వేదిక

ప్రజాశక్తి - యానాం

విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్స్‌పై ఆదివారం సాయంత్రం ప్రజా చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు అధ్వర్యంలో జరిగిన ఈ చర్చావేదిక యత్రా గార్డెన్లో పార్వతీశ్వరమ్మ మినీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ 2019లో కేంద్ర ప్రభుత్వం, ఉన్నతమైన న్యాయస్థానం ఇచ్చిన జిఒ ఎకనామికల్లి వికర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్స్‌పై తన దృష్టికి తీసుకొచ్చిన పలు ఫిర్యాదుల మేరకు ఈ చర్చ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ ప్రతిఫలాలు అందకుండా ధనికులకు అందుతున్నాయని, రిజర్వేషన్లు పక్కదారి పడుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా బిసి సంఘాల నాయకుడు గుత్తుల గోవింద జయ రామారావు, మంచాల సత్య సాయికుమార్, పెండెం సూర్య ప్రకాష్, గిడ్ల చంద్రరావు, దవులూరి పతి, హనుమంతరావు, లంక బంగారం, రమేష్ తదితరులు మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్స్‌లోని స్థానిక, స్థానికేతర అనే పదం వల్ల ఈ కులాలకు స్థానిక రిజర్వేషన్లు అందడం లేదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు జరుగుతున్న విధానంలో జరుగుతున్న అవకతవకలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం రానున్న రోజుల్లో అందరికీ రిజర్వేషన్ ఫలితాలు అందే విధంగా చర్యలు చేపట్టే విధంగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర కార్తీక్, మల్లాడి శామ్యూల్, చీకట్ల సత్యనారాయణ, దేవిడ్, కాపగంటి సూర్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

108 కేజీల లడ్డూ బహూకరణ

ప్రజాశక్తి - యానాం

కనకాలపేట రామాలయం సెంటర్లో ఏర్పాటుచేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి స్థానిక నాయకులు మచ్చా శ్రీను 108 కేజీలు లడ్డూ ప్రసాదాన్ని సమర్పించారు. ముందుగా స్వామివారి లడ్డూను మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అర్చకులు కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మచ్చా శ్రీనును ఘనంగా సత్కరించారు. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు కవల బాబులు, కోన సూరిబాబు, కోన కొండబాబు, జక్కపు బ్రహ్మయ్య, కోన నాగేష్, గొర్రెల రాజేష్, కోన సత్తియ్య, కోన దేవ, కమిటి ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

28న మిలాద్ ఉన్ నబీ సెలవు

ప్రజాశక్తి - యానాం

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్-ఉన్-నబీ పబ్లిక్ హాలీడే సందర్భ:గా ఈ నెల 28న సెలవు ప్రకటించినట్లు పుదుచ్చేరి శాఖ కార్యదర్శి ఎంవి హీరాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ అండర్ టేకింగ్స్, బోర్డులు, అన్ని బ్యాంకులు, కోపరేటివ్ బ్యాంకులకు సెలవును ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.

'ఆలమూరోళ్ల కథల' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఆలమూరు



ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

పెద్దపల్లకు చెందిన యువ రచయిత గొడవర్తి శ్రీనివాస్ రచించిన "ఆలమూరోళ్ల కథలు" పుస్తక ఆవిష్కరణ హైదరాబాదులో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ జరిగింది. పుస్తక ఆవిష్కరణ పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు సమక్షంలో జరిగింది. తెలుగు సాహిత్యంలో ఆలమూరు రచయితల పాత్ర అద్వితీయమని ఇనాక్ వ్యాఖ్యానించారు. కథా సాహిత్యంలో ఆలమూరు రచయితల పాత్ర ఎంత ఉన్నతమైనదో ఈ పుస్తకం ద్వారా తెలుస్తుందనిదర్శకులు రేలంగి నరసింహారావు వ్యాఖ్యానించారు. ఆది కార్యక్రమానికి దూరదర్శన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా పనిచేసి రిటైర్ అయిన డాక్టర్ సత్యవోలు సుందర సాయి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. సినీ నటుడు జెన్నీ, యువ కథా రచయిత కుప్పిలి సుదర్శన్, సాహితీ విమర్శకుడు కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు

దళిత నేత దుర్గారావు మరణం తీరని లోటు


ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి పెద్ద పేటకు చెందిన కార్మిక మరియు దళిత సంఘాల నాయకులు బడుగు దుర్గారావు మరణం తీరని లోటని మండల వైస్ ఎంపిపి బయ్యా చినబాబు పేర్కొన్నారు. దుర్గారావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు గంగుమళ్ల శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, సరెళ్ల సత్యనారాయణ, వైసిపి నాయకులు బొంతు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికులు వడ్డి శ్రీనివాసరావు, నామాడి ఏడుకొండలు, కోరపు శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసు తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ములగపూడిలో పర్యటించిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహ నాయక్ ఆదివారం పర్యటించారు ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న పిహెచ్‌సిని పరిశీలించారు అనంతరం నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. శృంగవరంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

లాభాల బాటలో ఆర్యాపురం బ్యాంకు: ఎంపి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

'ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు' లాభాల బాటలో పయనించడంసంతోషకరమని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం బ్యాంకు 104వ మహాజన సభ నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళా శాల ప్రాంగణంలో బ్యాంక్ ఛైర్‌పర్సన్ గిరజాల రామకష్ణ తులసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకుకు లక్ష మంది సభ్యత్వం ఉండటం అంటే..105 సంవత్సరాల చరిత్ర గల బ్యాంకు సేవలపై ఖాతాదారుల విశ్వాసం, అభిమానం స్పష్టమవుతోందన్నారు. బహుశా దేశంలోనే ఇంత పెద్ద సభ్యత్వం గల కో-ఆపరేటివ్ బ్యాంకు ఉండకపోవచ్చునని అన్నారు. రూ.వందల కోట్ల టర్నోవర్‌తో ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందిస్తున్న ఈ బ్యాంకు త్వర లోనే ఏ గ్రేడ్ స్థాయికి చేరగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొత్త డిపాజిట్ల సేకరణ, ఖాతాదారుల సంఖ్యను పెంచడం, అవసరమైన వారికి నిబంధనలు మేరకు రుణాలు ఇచ్చి అవి ఖచ్చితంగా వసూలు చేస్తూ మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన అవ సరం పాలకవర్గంపై ఉందన్నారు. ఏ ఆశయంతో అయితే ఈ బ్యాంకును దివం గత సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాద్ స్థాపించారో ఆయన ఆశయ సాధన దిశగా పాలకవర్గం, అధికారులు కృషి చేయాలన్నారు. మహాజన సభకు విచ్చేసిన సభ్యులకు బ్యాంకు సమకూర్చిన గిఫ్ట్‌లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ కొండేటి స్వరాజ్య లక్ష్మి, వైసిపి అర్బన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

వైసిపికి బాబ్జీరావు రాజీనామా

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గంలో వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న దివిలి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి నరాలశెట్టి బాబ్జి రావు ఆదివారం వైసిపి పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబుకు, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు మిథున్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్‌కు పంపుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా పార్టీలో తనకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో అసంతృప్తికి లోనై రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎస్‌కెఆర్ విద్యార్థి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్‌కెవిటి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని రెబాఅనిలా బాక్సింగ్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యిందని కళాశాల పిడి వై.సుధారాణి తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాఘవకుమారి విద్యార్థినిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనపర్చి నేషనల్ స్థాయికి వెళ్లి కళాశాలకు, తల్లీదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెఎస్ రత్నకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిమను కనపర్చిన విద్యార్థినిని ఆర్‌జెడి డాక్టర్ సిహెచ్ కష్ణ అభినందించారు.



ఎఎంసి ఛైర్మన్ కుడిపూడిని సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

శివన్నారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణను ముమ్మిడివరం శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో శివన్నారాయణ చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అనేక సామాజిక వర్గాలకు శివన్నారాయణ విశేష సేవలు అందించి నేడు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియోజకవర్గంలో ఉన్నత పదవిని అధిష్టించారని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కుడిపూడి శంకరరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, సానబోయిన మల్లికార్జునరావు, సంఘం అధ్యక్షులు దొమ్మేటి రమణకుమార్, పంపన రామకష్ణ, మట్టపర్తి లోవరాజు, రెడ్డి సతీష్, పిల్లి వీరనాగు, కడలి శ్రీనివాస్, కుటుంబరావు, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్ర కుర్ని కరికాల భక్త కార్పోరేషన్ డైరెక్టర్ కరేళ్ల రమేష్ బాబు ఇటీవల గొంతు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం రమేష్‌బాబును రంగాపురం ఆయన గహంలో రాష్ట్ర మంత్రి వినిపే విశ్వరూప్ పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. తుని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

25న సామర్లకోటలో జిల్లాస్థాయి స్పందన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఈనెల 25వ తేదీ సోమవారం సామర్లకోటలో జిల్లాస్థాయి స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమం జరుగుతుందని మండల తహశీల్దార్ ఎస్ లక్ష్మీ నరస కుమారి, మున్సిపల్ కమిషనర్ జె రామారావులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో సామర్లకోటలో మరోవారం స్పందన కార్యక్రమం నిర్వహించేందుకు కలెక్టర్ కృతిక శుక్లా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ స్పందన కార్యక్రమాన్ని గాంధీబొమ్మ సెంటర్‌లోని యార్లగడ్డ వెంకట సుబ్బారావు రైతు భవన్లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.